# 3

# ద్రాక్ష తోట గీతము

## (యెషయా 5)

యెషయా 5వ అధ్యాయంలో అతడు అందరికి పరిచయమైన ఒక అలంకార ప్రాయమైన పాఠాన్ని ప్రేక్షకులకు బోధించాడు. ద్రాక్ష తోటలు పెంచుట ద్రాక్ష రసమును తీయుట తూర్పు ప్రాంతములోని మధ్యదరా ప్రంతంలోని జనులకు ఎంతో ప్రధానమైన వృత్తి. ఈ ద్రాక్ష తోటలు పెంచడంలో ఎంతో జాగ్రత్తలు వహించేవారు. అడవి జంతువులు వచ్చి వాటిని పాడుచేయకుండా లేదా అన్యాక్రాంతం కాకుండా ఎంతగానో కాపాడే వారు ఈ ద్రాక్ష తోటల కోత సమయం దాన్ని నుంచి రసాన్ని తీయటం ఎంతో ఆనందంగా పండుగలాగా జరుపుకునేవారు (యిర్మీయా 48:33). ఇది ఇశ్రాయేలు దేశములో గుడారాల పండుగకు ఏడు రోజులు ముందుగా వచ్చేది ఆ రోజు కృతజ్ఞతా దినంగా సెలవు దినంగా ప్రకటించేవారు (ద్వితీయోపదేశకాండము 16:13). ఈ యొక్క ద్రాక్ష తోటలు ఆశీర్వాదాలకు అభివృద్ధికి ఆ దేశ ప్రజలకు సూచనలుగా వుండేవి ఈ ద్రాక్షతోటలు నిండుగా పండి ఫలించినప్పుడు అవి దేవుని ఆశీర్వాదాలకు ప్రతీకగా నిలిచాయి (హోషేయ 2:15). దేవునితో ప్రజలకున్న సంబంధ బాంధవ్యాలను బోధించడానికి యెషయా ఈ ఉపమానాన్ని వాడాడు.[1]

### నిరుత్సాహపరచిన ద్రాక్షతోట (5:1, 2)

> నా ప్రియుని గూర్చి పాడెదను వినుడి
> అతని ద్రాక్షతోటనుబట్టి నాకిష్టుడైన వానిగూర్చి పాడెదను వినుడి.
> సత్తువ భూమిగల కొండమీద నా ప్రియుని కొక ద్రాక్షతోట యుండెను
> ఆయన దానిని బాగుగా త్రవ్వి రాళ్లను ఏరి అందులో శ్రేష్ఠమైన ద్రాక్షతీగెలను నాటించెను
> దాని మధ్యను బురుజు ఒకటి వేయించి ద్రాక్ష తొట్టిని తొలిపించెను.
> ద్రాక్షపండ్లు ఫలింపవలెనని యెదురు చూచుచుండెను గాని అది కారుద్రాక్షలు కాచెను.

“ప్రియమైన” మరియు “ప్రియ” (1 వచనం) అనే మాటదీవీ హెబ్రీ పదాలుగా వాడబడ్డాయి. ఇదే విధమైన మాటలు పరమగీతములో 40 సార్లు వాడబడ్డాయి. ఈ పదాలు ఎంతో అనుబంధాన్ని తెలియజేస్తున్నాయి. దేవుని ప్రజలను ఉద్దేశించి ఈ పదం అనేక రీతులుగా అనేక పర్యాయాలు వాడబడినవి.[2]

యూదా ప్రాంతములో ఈ ద్రాక్ష తోటలను సిద్ధం చేయుట ఎంతో శ్రమతో కూడిన పని 2 వచనంలో చూచినట్లయితే రైతు ఈ తోటలు తయారు చేయటానికి ఎంత చెమటోర్చేవాడో, ఈ తోటలను మంచి ప్రాంతంలో పెంచడానికి మరియు మంచి ద్రాక్షాలు పండించడానికి ప్రయత్నించే వాడు. అతడు ఒక శిఖరాన్ని నిర్మించి ఆ తోటలను కాపాడటానికి కావలి వాళ్లని పెట్టేవారు. పంట సిద్ధమైన సమయానికి అక్కడ ఒక పెద్ద తొట్టిని తొలిచే వాడు. ఎంతో మంచి ద్రాక్షలు పండాలని ఎదురుచూచేవాడు మంచి ద్రాక్షలు కాయడానికి దాదాపుగా రెండు

సంవత్సరాలు పడుతుంది. ఈ మధ్య కాలమంత రైతు ఈ ద్రాక్షతోటను కాపాడటానికి ఎంతో శ్రమతీసుకొనే వాడు. ఏదిఏలా వున్నా ఇక్కడ చెప్పబడిన ఉపమానంలో ఈ తోట కారు ద్రాక్షలు కాసింది, ఎంత నిరుత్సాహం![3]

## తీర్పుకు పిలుపు (5:3-6)

కావున యెరూషలేము నివాసులారా, యూదావారలారా,
నా ద్రాక్షతోట విషయము నాకు న్యాయము తీర్చ వలెనని మిమ్ము వేడుకొనుచున్నాను.
నేను నా ద్రాక్షతోటకు చేసిన దానికంటే మరేమి దానికి చేయగలను?
అది ద్రాక్షపండ్లు కాయునని నేను కనిపెట్టినప్పుడు
అది కారు ద్రాక్షలు కాయుటకు కారణమేమి?
ఆలోచించుడి, నేను నా ద్రాక్షతోటకు చేయబోవు కార్యమును మీకు తెలియజెప్పెదను
నేను అది మేసివేయబడునట్లు దాని కంచెను కొట్టి వేసెదను.
అది త్రొక్కబడునట్లు దాని గోడను పడగొట్టి దాని పాడుచేసెదను
అది శుద్ధిచేయబడదు పారతో త్రవ్వబడదు.
దానిలో గచ్చపొదలును బలురక్కసి చెట్లును బలిసి యుండును.
దాని మీద వర్షింపవలదని మేఘములకు ఆజ్ఞనిచ్చెదను.

3 వచనం నుంచి 6 వచనం వరకు ప్రభువు యొక్క వాక్కును గమనిస్తూవున్నాము. ఆయన యెరూషలేము యూదా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ ద్రాక్షతోట ఫలితాలకు వారే తీర్పు తీర్చాలని కోరుతున్నాడు. వాస్తవానికి ప్రజలు తమకు తామే తీర్పు తీర్చుకుంటున్నారు. అన్న సంగతి వారికి ఇంకా గ్రహింపుకాలేదు![4]

చేయటానికి ఇంకా ఏమున్నది? ఇంతకాలము ఎదురుచూస్తే ఎలాంటి ఫలితం దక్కలేదు (4 వచనం). John N. Oswalt అనే రచయిత ఈ విధముగా ప్రస్తావించాడు, “లోకములో ఎంతో మంది ప్రేక్షకులు వారి ఉద్దేశాలు గమనించినట్లయితే కొందరైతే ఏమి లేదు అని అరిచేవారు ఇంకా కొందరైతే ఇంత పెట్టుబడి పెట్టామే అంతావృదా అయిందని నోటి మీద వ్రేలు వేసుకొనేవారు!”[5] ఇక ద్రాక్షతోట సొంతదారుడు ఎంత నింద భరించాలో ఈ ఉపమానాన్ని వినే శ్రోతలు ఈ ద్రాక్షతోట రైతు నిరుత్సాహానికి గురి అయ్యాడని వారు కూడ అదే మాదిరి నిరుత్సాహానికినికి గురైన పరిస్థితుల్లో కలత చెందేవారు.

ఈ ద్రాక్షతోట అలాగే విడిచిపెట్టబడి ఎవరు పట్టించుకొని పరిస్థితులకు గురైయింది ఎందుచేతనంటే అతడు నిరీక్షించిన విధముగా ఫలితాలు చూపించలేదు కాబట్టి (5, 6 వచనాలు). అది మంచి ఫలాలు ఫలించలేదు.

## తీర్పులోనికి వచ్చినవారు (5:7)

ఇశ్రాయేలు వంశము సైన్యములకధిపతియగు యెహోవా ద్రాక్షతోట
యూదా మనుష్యులు ఆయన కిష్టమైన వనము.
ఆయన న్యాయము కావలెనని చూడగా బలాత్కారము కనబడెను;
నీతి కావలెనని చూడగా రోదనము వినబడెను.

దేవుని యొక్క ద్రాక్షాతోట ఇశ్రాయేలు, మరియు, యూదా అయ్యివున్నది. Edward

J. Young అనునతను ఇలా అన్నాడు. "పాటకు పద్యానికి సమయం దాటిపోయింది. అనుసరణకు విపులీకరణకు సమయం ఆసన్నమైనది."[6] ప్రభువు ఎదురుచూచిన ఫలితాలు ఏమనగా న్యాయము, నీతి, ఇతర ప్రవక్తలు కూడ ఇశ్రాయేలు, యూదా విషయంలో అదే విధమైన ఆలోచనలు ఆలోచించారు.[7]

యెషయా వాడిన "పదము" అది హెబ్రీ అనువాద పదం "న్యాయం" (*mishpat*) మరియు "రక్తం చిందించడం" (*mispach*) మరియు "నీతి యుక్తమైన" (*tsedaqah*) మరియు "కలత చెందుట" (*tse'aqah*).

## శ్రమ (శిక్షా) తీర్పు (5:8–23)

యెషయా యూదాలోని పరిస్థితులను ప్రభువు ఎలా ఎదురు చూచాడో మరియు ప్రభువు ఆ ప్రజలపై ఆరు రకాల శిక్షలను విధించడం ప్రస్తావించాడు ఈ శిక్షలు ఇశ్రాయేలీయుల "పనికి మాలిన ద్రాక్షాలను" రుజువు చేస్తున్నాయి. ప్రతి యొక్క శ్రమ దేవునికి ఆ ప్రజలకు మధ్యవున్న నిబంధన సమయాన్ని వివరిస్తాయి.

### దురాశగలవారికి శ్రమ (8–10 వచనాలు)[8]

> స్థలము మిగులకుండ మీరు మాత్రమే దేశములో నివసించునట్లు,
> ఇంటికి ఇల్లు కలుపుకొని పొలమునకు పొలము చేర్చుకొను మీకు శ్రమ.
> నేను చెవులారా వినునట్లు సైన్యములకధిపతియగు యెహోవా స్పష్టముగా ఈ మాట నాతో సెలవిచ్చెను. – నిజముగా గొప్పవియు దివ్యమైనవియునైన యిండ్లు అనేకములు నివాసులులేక పాడైపోవును. పది ఎకరముల ద్రాక్షతోట ఒక కుంచెడు రసమిచ్చును తూమెడుగింజల పంట ఒక పడి యగును (8–10 వచనాలు).

ఈ మొదటి శ్రమ ఎవరిపై మోపబడిందంటే "స్థలము మిగులకుండ మీరు మాత్రమే దేశములో నివసించునట్లు ఇంటికి ఇల్లు కలుపుకొని పొలమునకు పొలము చేర్చుకొను మీకు శ్రమ" (8 వచనం). దేవుని యొక్క ధర్మశాస్త్రము ఏమి సూచిస్తుందంటే ఈ వాగ్దాన దేశములో ఏ కుటుంబానికి ఎంత స్థలం కేటాయించబడిందో అది వారికే చెందుతుంది. జూబ్లి సంవత్సరములో (ప్రతి 50 సంవత్సరాలకు ఒక్కసారి) అమ్మబడిన స్థలము తిరిగి సొంతదారునికే ఇచ్చివేయబడవలెను (లేవీయకాండము 25:13–17, 23, 24). ఈ చట్టాన్ని క్రీ.పూ. 8వ శతాబ్దంలో ఉల్లంఘించడం జరిగింది. ఈ పొలాలను లేక స్థలాలను దురాక్రమన చేయటం చాలా తప్పుపాటు వారి ఆశబోతు స్వభాన్ని యెషయా మాత్రమే కాక, ఆమోసు, మీకాలు కూడ ఖండించారు (మీకా 2:2, 9; ఆమోసు 2:6, 7).

ఈ యొక్క వాక్యం "నేను చెవులారా వినునట్లు సైన్యములకధిపతియగు యెహోవా స్పష్టముగా ఈ మాట నాతో సెలవిచ్చెను – నిజముగా గొప్పవియు దివ్యమైనవియునైన యిండ్లు అనేకములు నివాసులులేక పాడైపోవును" (9 వచనం). ప్రవక్తకు దేవుడు ప్రత్యక్షపరచిన సత్యాన్ని సూచిస్తుంది. అనేక గృహాలు నిర్మానుషంగా అయిపోతాయి. ప్రజలు వారి పాపాల వల్ల వారు ఎంతో విలువగా భావించుకొన్న ఆస్థిపాస్థులను కోల్పోతారు. దానిలో వారి పొలాలు, వారి గృహాలు, సహితము ఇమిడివున్నాయి. వారు అలా చేయటం వలన దేవుని యొక్క నీతిని ఉల్లంఘించిన వారు అవుతారు. మోటియర్ అనే అతను వ్రాస్తు "పాతనిబంధన

ఆస్థిపాస్థులను గురించి ఏ విధముగా నిందించడం లేదుగాని అవి ఎలా సంపాందించారు అన్న విషయమే ఎంతో పట్టింపుతో ఎన్నిక చేస్తుంది."[9]

భూమి దేవుని ద్వారా శపించబడింది (10 వచనం). దానిమీద సరైన పంట రాకపోవటం కూడ ప్రజల పాపాలకు కారణం అవుతుంది. ఇక్కడ "కుంచెడు" అనగా 6 గాలన్స్‌ల (22.74 లీటర్స్) - పది ఎకరాలకు వచ్చే రసము రాబడిగా వుంది. ఒక "ఎఫ్" అనగా "ఓమేర్"లో[10] పదవ భాగం. దీన్ని బట్టి చూచినట్టయితే రైతులు వారు విత్తిన విత్తనాలను కూడ తిరిగి సంపాదించుకోలేదు అని అర్థం అవుతుంది!

## లైంగిక పాపులైన ప్రజలకు శ్రమ (11-17 వచనాలు)

> మద్యము త్రాగుదమని వేకువనే లేచి ద్రాక్షారసము తమకు మంట పుట్టించు వరకు చాల
> రాత్రివరకు పానముచేయువారికి శ్రమ.
> వారు సితారా స్వరమండల తంబుర సన్నాయిలను వాయించుచు. ద్రాక్షారసము త్రాగుచు
> విందు చేయుదురుగాని యెహోవా పని యోచింపరు
> ఆయన హస్తకృత్యములను లక్ష్యపెట్టరు.

సంపన్నులైన ఇశ్రాయేలీయులు భోగభాగ్యాలను ఎల్లప్పుడు కోరుకుంటున్నారు. మధ్యపానం చేయటం వారి జీవన విధానం విందులు, విలాసాలు గురించి వారు తలంపులు ఎప్పుడు ఆకర్షితులై వున్నారు. దేవుని పనిచేయటానికి వారికి సమయం లేదు శక్తి లేదు (12 వచనం).

> కావున నా ప్రజలు జ్ఞానము లేకయే చెరపట్టబడి పోవుచున్నారు;
> వారిలో ఘనులైనవారు నిరాహారులుగా నున్నారు
> సామాన్యులు దప్పి చేత జ్వరపీడితులగుదురు.
> అందుచేతనే పాతాళము గొప్ప ఆశ పెట్టుకొని అపరిమితముగా తన నోరు తెరచుచున్నది
> వారిలో ఘనులును సామాన్యులును
> ఘోష చేయువారును హర్షించువారును పడిపోవుదురు.

"జ్ఞానం లేక పోవడం" (13 వచనం) వారికున్న అసలైన సమస్య. యెషయా దీని గురించి ముందుగానే ప్రస్తావించాడు 1:3: "ఇశ్రాయేలుకు తెలివిలేదు నా జనులు యోచింపరు." ప్రభువు ఇలా అన్నాడు, "నా జనులు జ్ఞానములేనివారై నశించుచున్నారు. నీవు జ్ఞానమును విసర్జించుచున్నావు గనుక నాకు యాజకుడవు కాకుండ నేను నిన్ను విసర్జింతును; నీవు నీ దేవుని ధర్మశాస్త్రము మరచితివి గనుక నేనును నీ కుమారులను మరతును" (హోషేయ 4:6ఎ). "తెలుసుకొనుట" అనే మాట అసలైన భాషలో అర్థం మేమంటే సంబంద బాంధవ్యాలు దేవునికి ఇశ్రాయేలీయుల పట్ల నిబంధన అనుబంధం వున్నది.[11] ఈ రోజున సంఘంపట్ల ఆయనకు అదే వాంఛ అయ్యివున్నది. "శిష్యుడు" అనే పదం "నేర్చుకొనువాడు" అనే మాటకు సరిపోతుంది. అనగా తన బోధకుని చిత్తాన్ని నెరవేర్చువాడు (యోహాను 6:45 చూడు). క్రైస్తవ్యం ఉపదేశించునది, పట్టుకోబడినది కాదు.

"అందుచేతనే పాతాళము గొప్ప ఆశ పెట్టుకొని అపరిమితముగా తన నోరు తెరచుచున్నది" (14 వచనం). ఇక్కడ పాతాళము అంటే చనిపోయిన వారుండే స్థలము.

ఇంత అదో స్థితి యెషయా వివరిస్తూన్నాడంటే అది చివరకు నాశనమై చచ్చిపోవడం అని అర్థం చేసుకోవచ్చు. పాతాళపు సమాధి బహు భయంకరమైనది "అల్పులు అణగద్రొక్క బడుదురు ఘనులు తగ్గింపబడుదురు గర్విష్ఠుల చూపు తగ్గును" (15 వచనం). అందరు "సిగ్గుపరచబడతారు" ఈ లోకములో ఏది సాధించినా చేసినా అది "ప్రభువుకు చేసిందయి వుంటే తీర్పును తప్పించు కోవడం జరుగుతుంది" (ఎఫెసీయులకు 5:22; 6:7).

> అల్పులు అణగద్రొక్కబడుదురు ఘనులు తగ్గింపబడుదురు గర్విష్ఠుల చూపు తగ్గును
> సైన్యములకధిపతియగు యెహోవాయే తీర్పు తీర్చి మహిమపరచబడును
> పరిశుద్ధుడైన దేవుడు నీతినిబట్టి తన్ను పరిశుద్ధ పరచుకొనును.
> అది మేతబీడుగా నుండును గొఱ్ఱెపిల్లలు అచ్చట మేయును
> గర్వించినవారి బీడు భూమిని విదేశీయులైన కాపరులు అనుభవింతురు.

16 వచనం దేవుడు "పరిశుద్ధుడు" అంటూ దేవుని పరిశుద్ధతకు చెందినదిగావున్నది. Motyer గారు చెప్పిన రీతిగా "పరిశుద్ధులు" అంటే "దేవుని స్వభావమే" అది దేవుని నీతిలో ఆయన తీర్పులో దేవుని పరిశుద్ధత కనిపిస్తుంది. దేవుని పరిశుద్ధులుగా వుండాలి ఎందుచేతనంటే ఆయన పరిశుద్ధుడు కాబట్టి (లేవీయకాండము 19:2). మనం ఈ లోకములో ప్రవర్తన నడవడికి ఆయన పరిశుద్ధత మనకు పునాదిగా నిలుస్తుంది. అది గనుక కొన్నట్లయితే ప్రజలు ఎవరిదారిన వారు దుష్టస్వభావాలతో పాపానికి ఈడ్వబడి మితిమీరిన పాపంలోనికి జారిపోతారు.

"అది మేతబీడుగా నుండును" (17 వచనం) మందలకు చక్కని పచ్చికగా మారుతుంది ఇది వారి రాజ్యగృహాలను గూర్చి తెల్పుచున్నది అవి సర్వ నాశనమైపోతాయి. కూలద్రోయబడతాయి.

**అవిశ్వాసులైన ప్రజలకు శ్రమ (18, 19 వచనాలు)**

> భక్తిహీనతయను త్రాళ్లతో దోషమును లాగుకొను వారికి శ్రమ.
> బండిమోకులచేత పాపమును లాగుకొనువారికి శ్రమ వారు ఇట్లనుకొనుచున్నారు;
> – ఆయనను త్వరపడనిమ్ము మేము ఆయన కార్యమును చూచునట్లు ఆయనను దానిని వెంటనే చేయనిమ్ము
> ఇశ్రాయేలుయొక్క పరిశుద్ధదేవుని ఆలోచన మాకు తెలియబడునట్లు
> అది మా యెదుట కనబడనిమ్ము.

ఇశ్రాయేలీయుల యొక్క వైఖరి దేవుని పట్ల ఎంత భయంకరంగా వుందంటే దేవుని మీద పూర్తిగా తిరుగుబాటు చేస్తూ ఆయన శక్తినే శంకించే స్థితిలో యున్నారు. వారేం చేస్తున్నారంటే "భక్తిహీనతయను త్రాళ్లతో దోషమును లాగుకొను వారికి శ్రమ. బండిమోకులచేత పాపమును లాగుకొనువారికి శ్రమ వారు ఇట్లనుకొనుచున్నారు" (18 వచనం). ధర్మశాస్త్రాన్ని ఉల్లంఘించారు, వంకర స్వభావాలతో అబద్ధ వేషధారి బ్రతుకువీడుస్తూ అన్ని రకాల పాపాల్లో కూరుకుపోయిన స్థితిలో యున్నారు. వాళ్ల బ్రతుకులు ఎలావున్నాయంటే వారి జ్ఞాన సంపాదనలో అసలు దేవునికి తావేలేదు అంటూ పౌలు వ్రాసినట్లుగా అలాంటి పరిస్థితిలో యున్నారు (రోమీయులకు 1:18–32).

### సత్యాన్ని దారి మళ్ళించే వారికి శ్రమ (20 వచనం)

కీడు మేలనియు మేలు కీడనియు చెప్పుకొని చీకటి వెలుగనియు వెలుగు చీకటనియు
ఎంచుకొను వారికి శ్రమ;
చేదు తీపి అనియు తీపి చేదనియు ఎంచుకొనువారికి శ్రమ!

దేవుని వాక్య మాదిరిని త్రోసివేసినట్టయితే అన్ని విలువలు తల క్రిందులైనట్లు సుమా! యెషయా సమయంలో ఆ రోజుల్లో అలాంటి పరిస్థితులున్నాయి, ఈ రోజుల్లో కూడ అదే పరిస్థితులు సుమా! ఈ రోజుల్లో ఈ పరిస్థితులను మన కళ్ళారాచూస్తున్నాం. లోకం కూడ చెడును మంచిగా మంచిని చెడుగా భావిస్తున్నది. వేశ్యసాంగత్యం త్రాగుడు స్వలింగ సంపర్కము యింకా యితర పాపాలు రోడ్డునపడ్డాయి లోకం వాటిని సమాజంగా జరిగే కార్యకలాపాలే కదా అంటూ బల్లగుద్ది చాటుతుంది. అయ్యో ఈ రోజుల్లో ప్రజలు ఎంత భయంకరమైన చీకట్లో జీవిస్తున్నారు, ఎంత విచారం.

### వారి దృష్టిలో వారు జ్ఞానులనుకొనేవారికి శ్రమ (21 వచనం)

తమ దృష్టికి తాము జ్ఞానులనియు
తమ యెన్నికలో తాము బుద్ధిమంతులనియు తలంచుకొనువారికి శ్రమ.

మన దృష్టిలో మనం జ్ఞానులమని అనుకోవడం గురించి సొలొమోను వ్రాస్తున్నాడు (సామెతలు 3:7). పౌలు కూడ క్రైస్తవులను యిలా ప్రోత్సహిస్తున్నాడు “తన్నుతాను ఎంచుకొనతగినదానికంటె ఎక్కువగా ఎంచుకొనగ” (రోమీయులకు 12:3). అసలైన జ్ఞానము ఎలా వస్తుందంటే ప్రభువుకు భయపడి ఆయన ఆజ్ఞలకు శిరసావహిస్తే వస్తుంది (ప్రసంగి 12:13).

### న్యాయాన్ని మళ్ళించే ప్రజలకు శ్రమ (22, 23 వచనాలు)

ద్రాక్షారసము త్రాగుటలో ప్రఖ్యాతినొందిన వారికిని మద్యము కలుపుటలో తెగువగలవారికిని
శ్రమ.
వారు లంచము పుచ్చుకొని దుష్టుడు నీతిమంతుడనితీర్పు తీర్చుదురు
నీతిమంతుల నీతిని దుర్నీతిగా కనబడచేయుదురు.

“ప్రఖ్యాతినొందిన” మరియు “తెగువగలవారు” (22 వచనం) ఈ మాటలు ఎంతో యుద్ధప్రవీణులైన వారికి చెందినవి, ధైర్యశాలులకు చెందినవి ఇక్కడ ఈ పదాలు ఎంతో వ్యంగ్యముగా వాడబడినవి. ఎందుచేతనంటే వీరు తమ శత్రువుల కంటే భయంకరముగా మత్తుపానీయాలు త్రాగేవారు సుమా!

లంచాలు తీసుకోవడం (23 వచనం) అది దేవుని నామాన్ని దూషణపాలు చేయడమే అవుతుంది.[13] అది నీతి మంతులకు అందవలసిన న్యాయాన్ని వారికి దక్కకుండ చేస్తుంది. న్యాయాధిపతులు నీతియుక్తమైన తీర్పులు తీర్చాలని మోషే ధర్మశాస్త్రం ఖచ్చితంగా చెబుతుంది: “నీవు న్యాయము తప్పి తీర్పుతీర్చకూడదు; పక్షపాతము చేయకూడదు; లంచము పుచ్చుకొనకూడదు. ఏలయనగా లంచము జ్ఞానుల కన్నులకు గ్రుడ్డితనము కలుగజేయును

నీతిమంతుల మాటలకు అపార్థము పుట్టించును" (ద్వితీయోపదేశకాండము 16:19).

### ద్రాక్షాతోటకు ఎదురైన చేదు పరిణామాలు (5:24-30)

యూదా చేసిన పాప పరిణామాలు ఎంత భయంకరంగా వున్నాయో 5వ అధ్యాయంలో చివరి వచనాలలో సంక్షిప్త పరచబడింది. పాపం శిక్షను కొని తెస్తుంది. మనము ఏది విత్తుతామో ఆ పంటనే కోస్తాం (గలతీయులకు 6:7) "అడవివంగడాలు" విత్తడం అనే సమస్య కోతను తప్పని సరిచేసింది!

> సైన్యములకధిపతియగు యెహోవాయొక్క ధర్మ శాస్త్రమును నిర్లక్ష్యపెట్టుదురు
> ఇశ్రాయేలుయొక్క పరిశుద్ధదేవుని వాక్కును తృణీక రించుదురు.
> కాబట్టి అగ్నిజ్వాల కొయ్యకాలును కాల్చివేయునట్లు
> ఎండిన గడ్డి మంటలో భస్మమగునట్లు వారి వేరు కుళ్లి పోవును
> వారి పువ్వు ధూళివలె పైకి ఎగిరిపోవును.
> దాని బట్టి యెహోవా కోపము ఆయన ప్రజలమీద మండుచున్నది.
> ఆయన వారిమీదికి తన బాహువు చాచి వారిని కొట్టగా పర్వతములు వణుకుచున్నవి.
> వీధులమధ్యను వారి కళేబరములు పెంటవలె పడి యున్నవి.
> ఇంతగా జరిగినను ఆయన కోపము చల్లారలేదు
> ఆయన బాహువు ఇంకను చాపబడియున్నది (యెషయా 5:24, 25).

ప్రకృతి బీభత్సాలైన కరవుకాటకాలు, భూకంపాలు అనే వాటిని రప్పించుట ద్వారా యూదామీదికి శిక్షను దేవుడెలా విధించాలి అన్న దాన్ని ఈ వాక్యభాగంలో బోధిస్తుంది. వారు చచ్చినవారిని ప్రజలుపాతిపెట్టుకోడానికి కూడ అవకాశం లేకుండ పోయింది.

తన ప్రజలమీద దేవుడెందుకు యింతటి విపత్తు తీసుకొని వచ్చాడు? 24 వచనంలో దీనికి జవాబు లభిస్తుంది: "సైన్యములకధిపతియగు యెహోవాయొక్క ధర్మశాస్త్రమును నిర్లక్ష్యపెట్టుదురు ఇశ్రాయేలుయొక్క పరిశుద్ధదేవుని వాక్కును తృణీకరించుదురు." ఈ తీర్పు శిక్షకు తగిన కారణాలు మనకు దీంట్లో కనిపిస్తున్నాయి "త్రోసివేయుట," మరియు "తృణీకరించుట" అనే రెండు క్రియలు, ఆ ప్రజలు దేవునినెంత కించపరచారో అన్న విషయాన్ని వెల్లడి చేస్తున్నాయి.[14] 1:4లో వారు దేవుని తృణీకరించారని, తిరుగుబాటు చేశారని, విడిచిపెట్టినారంటూ యెషయా వారిపై నిందమోపినాడు దేవుని వాక్యానికి విధేయత చూపించకుండా ఎవరైనా నిర్లక్ష్యముచేశారంటే యిదే సంభవిస్తుంది. ఇంకో విషయం యిక్కడ మనం గ్రహించాలి. వారు ఆయన చిత్తాన్ని ఒక ప్రక్క తృణీకరించుతూ మరో ప్రక్క ఆయన్ను ఆరాధిస్తూ బలులర్పిస్తున్నారు. ఈ రోజున మనవైఖరి అలాగేవున్నదా? ఆయనను మనం ఆరాధించడానికి విధేయత చూపుచున్నామా? లేక ఆయన వాక్యాన్ని త్రోసివేసి ఆయన చిత్తాన్ని నెరవేర్చని రీతిగాయున్నామా? ఎలావున్నాం మనం?

ప్రభువుయొక్కకోపము (25 వచనం) అనేమాట యెషయా గ్రంథంలో ఇరవైనాలుగుసార్లు చెప్పబడింది.[15] ఆయన నిబంధనను వారు త్రోసివేశారు కాబట్టి ఇశ్రాయేలుపై దేవుని ఉగ్రత కుమ్మరింపబడింది. మోషే ఇలా అన్నాడు "దోషమును అతిక్రమమును పరిహరించువాడును, అపరాధిని నిరపరాధిగా ఎంచక మూడు నాలుగు తరములవరకు తండ్రుల దోషమును కుమారులమీదికి తెచ్చువాడునై యున్నాడని నీవు చెప్పిన మాట చొప్పున నా ప్రభువుయొక్క

బలము ఘనపరచబడును గాక" (సంఖ్యాకాండము 14:18). దేవుని కోపాన్ని ఆయన ఉగ్రతను అలక్ష్యం చేస్తున్నారు ప్రజలు. పేతురు క్రైస్తవులనుద్దేశించి వ్రాస్తు, "కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతముగలవాడై యున్నాడు" (2 పేతురు 3:9) అని అంటున్నాడు. ఆయన ప్రేమగల దేవుడు అదే సమయంలో కోపాగ్ని గల దేవుడు కూడ. అలాంటి ఆయన స్వభావాన్ని మనం శంఖిస్తే మనం ఎంతో ఇబ్బందిలో పడతాం.

"ఆయన హస్తాలు యింకా చాచబడేవున్నది" అంటున్నాడు యెషయా యొక్క ప్రవచనం మనం గమనించినట్లుయితే దేవుని తీర్పు యిప్పుడు కార్యరూపం దాల్చి జరుగుచున్నది. (చూడు 9:12, 17, 21; 10:4.)

> ఆయన దూరముగానున్న జనములను పిలుచుటకు ధ్వజము నెత్తును
> భూమ్యంతమునుండి వారిని రప్పించుటకు ఈల గొట్టును
> అదిగో వారు త్వరపడి వేగముగా వచ్చుచున్నారు.
> వారిలో అలసినవాడైనను తొట్రిల్లువాడైనను లేడు.
> వారిలో ఎవడును నిద్రపోడు కునకడు వారి నడికట్టు విడిపోదు
> వారి పాదరక్షలవారు తెగిపోదు.
> వారి బాణములు వాడిగలవి వారి విండ్లన్నియు ఎక్కు పెట్టబడియున్నవి
> వారి గుఱ్ఱముల డెక్కలు చెకుముకిరాళ్లతో సమాన ములు
> వారి రథచక్రములు సుడిగాలి తిరిగినట్టు తిరుగును
> ఆడుసింహము గర్జించినట్లు వారు గర్జించుదురు
> కొందమసింహము గర్జించినట్లు గర్జనచేయుచు
> వేటను పట్టుకొని అడ్డమేమియు లేకుండ దానిని ఎత్తుకొని పోవుదురు
> విడిపింపగలవాడెవడును ఉండడు.
> వారు ఆ దినమున సముద్రఘోషవలె జనముమీద గర్జనచేయుదురు
> ఒకడు భూమివైపు చూడగా అంధకారమును బాధయు కనబడును
> అంతట ఆ దేశముమీది వెలుగు మేఘములచేత చీకటి యగును (యెషయా 5:26-30).

"ఆయన ధ్వజమునెత్తుచున్నాడు" అంటూ 26 వచనంలో ప్రవక్త అంటున్నాడు. ఒక "ధ్వజము" (*nes*) అనగా సూచించు పతాకము. నాశనకారులను దేవుడు పిలుచుచున్నరీతిగా తన ప్రజలను చెఱలోనుండి పిలుచుచున్నాడు.[16] "అది త్వరలోనే వస్తుంది" అనే మాట ఎక్కడో దూరమునవున్న దేశమును సూచిస్తుంది. అనగా యూదాలో దుష్టత్వం చేస్తున్న వారిపై దేవుడు తన కోపాగ్ని కుమ్మరిస్తున్నట్లున్నది ఆ దేశము ఏదనగా అష్షూరు దేశము అని తెలుస్తుంది, ఆ తరువాత తన ఉద్దేశాన్ని నెరవేర్చుకొనడానికి దేవుడు బబులోనును వాడుకున్నాడు.

"యెషయా చిత్రీకరించిన సైన్యం యిక్కడ ఎలావుందంటే, ఎంత వేగముగా వచ్చుచూ, అలసిపోనిదిగా, దయ కనికరాలు లేని ఖఠినమైన గర్జించు సింహమువలె యున్నది" అని Terry Briley గారు అంటున్నాడు.[17] నీనెవే ప్రాకారపుగోడల వద్ద పునరావస్తు శాఖ వారు త్రవ్వకాలు జరిపించగా కొన్ని నిక్షేపాలు బయటపడినవి అవి బ్రిటిష్ మ్యూజియంలో భద్రపరచబడ్డాయి, అవి అష్షూరు సైనికుల చిత్రాలు వారి దగాల చిత్రాలు, అచ్చంగా 27 నుండి 29 వచనాల్లో చిత్రీకరించినట్లుగా వున్నాయి. ఈ అందాల చిత్రాలు అష్షూరు

రాజైన సన్హెరీబు అతడు యూదా పట్టణమైన లాకీషును పట్టుకోవడం గురించిన ఘటం గురించి చిత్రీకరించబడ్డాయి. అది క్రీ.పూ. 701లో జరిగింది. దీనులు నలిగిపోయిన ప్రజానీకం పట్ల ఈ అష్షూరు సైన్యాలు ఎంత క్రూరంగా ప్రవర్తించాయో వివరించలేము.

"అంధకారము" మరియు "బాధ" (30 వచనం) అనే రెండు పదాలు అక్కడ పరిస్థితులను వున్నవివున్నట్లుగా ఎలాంటి నిరీక్షణ సహాయం లేకుండా దేవుని ప్రజలు విడిచిపెట్టబడినారు సుమా!

ఇది ఈ పుస్తక పరిచయాన్ని[18] ముగిస్తుంది. యెషయా 1వ అధ్యాయం నుండి 5వ అధ్యాయం వరకువున్న భాగాన్ని హోమర్ హలీ అనే ప్రముఖుడు ఎంత మనోహరంగా సంగ్రహ పర్చుచున్నాడు:

> మూడు వేరువేరు ప్రవచనాలు మనముందున్నాయి: (1) అవినీతి ప్రబలడం, తల మొదలుకొని అరికాలు వరకు పాప భూయిష్టమైన జీవితాలపై దేవుని తీర్పుగా ఆయన ఉగ్రత దిగిరావడం జరుగుతుంది. కాని దేవుని యొక్క తీర్పు కొనసాగుతూ, ఆయన కనికరం కృప మరలా విస్తరిస్తున్నందున ఆయన తన కొరకు కొంత శేషజనాన్ని ప్రత్యేకించుకొంటున్నాడు (1వ అధ్యాయం). (2) యెషయా సమయంలో వున్న నిజమైన సీయోను ఎంతో తిరుగుబాటు స్వభావంతో, పాపభూయిష్టమైనప్పటికి, మరొక మాదిరికరమైన సీయోను ఉద్భవించడం జరుగుతుంది. అది ఎలా అంటే శిక్షించడం, శుద్దీకరించడం, శ్రమలు అనే కొలిమిలో కాల్వడం ద్వారా శుద్ది చేయబడినవి (2–4 అధ్యాయాలు). (3) ఆ ప్రియుని ద్రాక్షతోట చేదు కారుద్రాక్షలు కాసింది అనగా పాపాన్ని కనడం, తద్వారా అంధకారాన్ని భయంకరమైన తీర్పును కొని రావడం జరిగింది (5వ అధ్యాయం). ఇంత భయంకరమైన తీర్పు కూడ దేశానికి పశ్చాత్తాపం తీసుకురాలేకపోయింది. అయినప్పటికి దాని నుండే శిక్షించబడిన, శుద్దీకరించబడిన శేషము లేక శేషజనము మిగిలియుండడం జరుగుతుంది.[19]

---

సూచనలు

[1]ఇశ్రాయేలు యొక్క విడుదలను వివరించుటకు ద్రాక్షాతోట ఉపమానమునకు అతడు తిరిగి వచ్చును (యెషయా 27:2-6). యేసు ద్రాక్షాతోట ఉపమానమును తన శిష్యులకు బోధించుటకు ఉపయోగించెను (మత్తయి 20:1-16; 21:33-41; యోహాను 15:1-11). [2]చూడు ద్వితీయోపదేశకాండము 33:12; కీర్తనలు 60:5; 108:6; యిర్మీయా 11:15. [3]కారు ద్రాక్షలు అనే హెబ్రీ పదం "చెడ్డ వాసన" అను అర్థమిచ్చు మూల పదమునుండి వచ్చింది. 2వ వచనం "చెడ్డ ఫలం" (NIV) లేక "కారు ద్రాక్ష" (NRSV; NEB) అని పలురకాలుగా తర్జుమా చేయబడింది. అది నిరుపయోగ, పులిసిన, కారు ద్రాక్షాలను సూచిస్తుంది. (Terry Briley, *Isaiah*, vol. 1, The College Press NIV Commentary [Joplin, Mo.: College Press Publishing Co., 2000], 84; J. Alec Motyer, *The Prophecy of Isaiah: An Introduction & Commentary* [Downers Grove, Ill.: InterVarsity Press, 1993], 68.) [4]ప్రవక్తయైన నాతాను దావీదునొద్దకు వచ్చినప్పుడు దావీదు తనను గూర్చి తాను విమర్శించుకొనెను (2 సమూయేలు 12:1-7). [5]John N. Oswalt, *The Book of Isaiah, Chapters 1-39,* The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1986), 154. [6]Edward J. Young, *The Book of Isaiah,* vol. 1, The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1965), 203. [7]చూడు యిర్మీయా 7:5; 21:12; యెహెజ్కేలు 45:9; ఆమోసు 5:24; మీకా 6:8; జెకర్యా 7:9. [8]ఈ భాగములోని సంక్షిప్త వివరణ Young, 205-06పై ఆధారపడినది. [9]Motyer, 70. [10]ఒక ఎఫ్ మూడు పెక్కులకు సమానమైనది (26.43 లీటర్స్), మరియు ఒక ఓమేరు 6 భూష్ల్స్‌కు (211.434 liters) సమానము.

[11]యెషయా 1:3పై ఉన్న చర్చను చూడు. [12]Motyer, 72. [13]చూడు ద్వితీయోపదేశకాండము 27:25; నిర్గమకాండము 23:8. [14]Francis Brown, S. R. Driver, and Charles A. Briggs, *A Hebrew and English Lexicon of*

*the Old Testament* (London: Oxford, Clarendon Press, 1972), 549, 610. [15]చూడు 9:17; 13:9, 13; 30:27, 30; 51:22; 54:8; 66:14. [16]చూడు 11:12; 18:3; 49:22; 62:10. [17]Briley, 94. [18]ఈ పదమును యెషయా 1–5 అధ్యాయలలో వివరించుటకు Motyer ఉపయోగించాడు. (Motyer, 73.) [19]Homer Hailey, *A Commentary on Isaiah* (Grand Rapids, Mich.: Baker Book House, 1985; reprint, Louisville, Ky.: Religious Supply, 1992), 73.

# వాక్య భాగాన్ని బోధించుట

**ఎడ్డీ క్లోయర్**

## ❖❖❖ నమ్మకమైన ద్రాక్ష తోట ❖❖❖ (5:1–7)

5:1–7 వరకువున్నది ఒక పాట, అది పగిలిన హృదయం యొక్క విషాద గీతం, ఒక అనాదగీతం ప్రేమకునోచుకోని హృదయం నుండి పొరలివస్తున్న పదజాలం. ఈ ద్రాక్షవనం గురించి తోటమాలి ఎంతో శ్రద్ధ తీసుకున్నాడు. మంచి ద్రాక్షలు కాస్తుందని మంచి దిగుబడి యిస్తుందని ఎంతగానో నిరీక్షించాడు. ఒక మంచి తోటమాలి అనబడిన వాడు తీసుకోవలసినంత శ్రద్ధ అతడు తీసుకున్నాడు, కాని ఈ గీతం చివరి చరణంలో నిరుత్సాహం, వృధా అయిన ప్రేమ అనే అర్థంతో ఆలపించడం జరిగింది. ఎంతో నిరాశా నిస్పృహలతో ఈ మాటలు ఇలా అంటున్నాడు “నేను నా ద్రాక్షతోటకు చేసినదానికంటె మరేమి దానికి చేయగలను?” (4ఎ వచనం).

ఇదొక ఉపమాన గీతం యిది యూదా యెరూషలేం ప్రజలనుద్దేశించి – మరియు దేవుని ప్రేమను పొందిన ఏ వ్యక్తికి వ్యక్తులకైన చెందుతుంది. మనకేమని చెప్పబడిందంటే “ఇశ్రాయేలు వంశము సైన్యములకధిపతియగు యెహోవా ద్రాక్షతోట యూదా మనుష్యులు ఆయన కిష్టమైన వనము” (7ఎ వచనం).

*తోటమాలి ద్రాక్షతోటను నాటినాడు.* “ఆయన దానిని బాగుగా త్రవ్వి రాళ్ళను ఏరి అందులో శ్రేష్ఠమైన ద్రాక్షతీగెలను నాటించెను” (2ఎ వచనం). అతడు మంచి సారవంతమైన నేలను అది ద్రాక్షతోటలకు సరైన స్థలమని నిశ్చయించుకున్నాడు, ఆ స్థలంలో వున్న రాయిరప్ప, తుంగలను పూర్తిగా ఏరివేసి చదును చేశాడు, ఏదైతే ఎదగడానికి అడ్డం వస్తుందో ఆ ఆటంకాలు తొలగించాడు.

తనను నాటిన ఆ తోటమాలికి ఆ ద్రాక్షతోట ఎంతో రుణపడియున్నది. అదే మాదిరిగా యూదాకు దేవుడు జీవాన్ని ప్రసాదించాడు. దాని ఉనికికి ఆయనే కారణమైనాడు ఎందుచేతనంటే దాన్ని ఐగుప్తు బానిసత్వం నుండి విడుదల చేసి విమోచించి సీనాయితో తన ధర్మశాస్త్రాన్ని, సమాజ మందిరాన్ని యిచ్చికాపాడినాడు. ఆయన దానిని తన ప్రియమైన బిడ్డగా పరిగణించుకున్నాడు.

*ఆయన ఆ ద్రాక్షతోటను సేద్యం చేశాడు.* ఏదో ద్రాక్షతోట నాటినంత మాత్రాన సరిపోదు. దానిని సేద్యం చేశాడు ఎంతో నమ్మకంతో శ్రద్ధతీసుకున్నాడు అది చక్కగా ఎదగడానికి అవసరమైన పోషకపదార్థాలు బలమైన ఎరువులు ఎంచి ఎంచి సమకూర్చాడు. దాని చుట్టు కలుపుమొక్కలు అనవసరంగా ఎదిగి దీని త్రొక్కివేయకుండునట్లు జాగ్రత్త వహించాడు;

ఏ రోగాలు రాకుండ కాపాడినాడు వాతావరణం, ఈదరగాలులు దాని మీద విసరకుండ ఎంతెంతో భద్రపరచినాడు.

అదే విధముగా యూదా జీవితాన్ని కూడ కాపాడినాడు అది చక్కగా ఎదగడానికి కావలసిన పరిస్థితులన్ని సమకూర్చాడు. ఆయన తన కౌగిలిలో బిడ్డను భద్రపర్చినట్లుగా భద్రపరచినాడు ఎంతో ప్రేమా ఆప్యాయతలు దానికి కావలసినవి ఏమిటో అది పొందునట్లు చేశాడు. ఏ కొరత అనేది లేకుండా చేశాడు. నడిపించాడు, సమకూర్చాడు, మానసికంగా సలహాలందించాడు ఎనలేని ప్రేమా వాత్సల్యత కుమ్మరించినాడు.

*ఆ ద్రాక్షాతోటను కాపాడినాడు.* అతడు దానికొక బురుజు వేయించెను (2బి వచనం) దానికి కాపలాకాశాడు ఏ జంతువులు లోపలికివచ్చి పండ్లు తినకుండ, తీగెలను కొరికివేసి వ్రేళ్ళను పెకలకుండా వుండేటట్టు ఎంతో జాగ్రత్త వహించాడు. ఒకడు గనుక తన కుటుంబాన్ని ఎలా కాపాడుకుంటాడో అలా ఆ ద్రాక్షాతోటను కాపాడినాడు. ఈ ద్రాక్షా తోట గురించి మరో మంచి మాటవుంది అది "ఆయన కిష్టమైన వనము" (7 వచనం).

అదే విధమైన క్షేమము యూదాకు కూడ సమకూర్చబడింది. దేవుడు దానిమీద దృష్టి యుంచాడు శతృదేశాల భారినుండి తప్పించబడింది. కొల్లపెట్టు వారినుండి కాపాడబడింది. దాని పక్షంగా యుద్దాలు ఆయనే చేశాడు క్లిష్ట పరిస్థితుల్లో ఆయనే కోటగా నిలిచాడు తుఫాను సమయాలో ఆయన ఆశ్రయదుర్గంగా అండగా నిలిచాడు.

*దాని భవిష్యత్ గురించి ఎన్నో కలలుగన్నాడు.* "ఆయన దానిని బాగుగా త్రవ్వి రాళ్ళను ఏరి అందులో శ్రేష్ఠమైన ద్రాక్షతీగెలను నాటించెను. దాని మధ్యను బురుజు ఒకటి వేయించి ద్రాక్షతొట్టిని తొలపించెను. ద్రాక్షపండ్లు ఫలింపవలెనని యెదురు చూచుచుండెను గాని అది కారుద్రాక్షలు కాచెను" (2బి, సి వచనం). ఎంతో ఆశతో ఎదురుచూస్తూ ఒక తొట్టిని కూడ తొలపించాడు ఎందుకంటే పంట సమయంలో దిగుబడియైన ద్రాక్షల ద్వారా మంచి ద్రాక్షారసాన్ని గానుగపట్టవచ్చు అనుకొని ఆ ద్రాక్షాతోట శ్రేష్ఠఫలాలతో మంచి దిగుబడి యిస్తుంది అనుకున్నాడు. అది శ్రేష్ఠమైన ద్రాక్షాలు యిరగ కాస్తుందని ఎక్కడా లేని ప్రేమ ఆప్యాయాతలతో తన శ్రద్ధను కుమ్మరించాడు.

ఎప్పుడైతే కోత సమయం ఆసన్నమైనదో ఈ తోట పనికి మాలిన ఫలాలను కాసింది. అవి కారు ద్రాక్షలుగా చేదుగా దేనికి పనికి రానివిగా వున్నాయి. "నేను నా ద్రాక్షతోటకు చేసినదానికంటే మరేమి దానికి చేయగలను? అది ద్రాక్షపండ్లు కాయునని నేను కనిపెట్టినప్పుడు అది కారు ద్రాక్షలు కాయుటకు కారణమేమి?" (4బి వచనం). ఈ వనం కారు ద్రాక్షలు కాయడానికి గల కారణాలేమిటో పాఠకులే తీర్పు తీర్చాలని కోరబడుచున్నారు. దేవుడిలా అంటున్నాడు "కావున యెరూషలేము నివాసులారా, యూదావారలారా, నా ద్రాక్షతోట విషయము నాకు న్యాయము తీర్చవలెనని మిమ్ము వేడుకొనుచున్నాను" (3 వచనం).

ఆ పాట చివర్లో ఆ తోటమీదికి తీర్పు తప్పక తాను తీర్చుకోవాలని ఆ తోట పై శిక్ష దిగివచ్చునట్లు చేస్తానని అంటున్నాడు "అలోచించుడి, నేను నా ద్రాక్షతోటకు చేయబోవుకార్యమును మీకు తెలియజెప్పెదను నేను అది మేసివేయబడునట్లు దాని కంచెను కొట్టివేసెదను. అది త్రొక్కబడునట్లు దాని గోడను పడగొట్టి దాని పాడుచేసెదను అది శుద్ధిచేయబడదు పారతో త్రవ్వబడదు దానిలో గచ్చపొదలును బలురక్కసి చెట్లును బలిసియుండును దానిమీద వర్షింపవలదని మేఘములకు ఆజ్ఞనిచ్చెదను" (5, 6 వచనాలు).

ఇక ఆ తోటను తృణీకరించి విడిచిపెట్టడం న్యాయము. ఫలితాలు శూన్యమైతే పతనమేదానికి తగింది అని అర్థం.

ఈ పాటలోని అర్థం గ్రహించినట్లయితే దేవుడు తన ప్రజలకు ఎందుకు తీర్పు తీరుస్తాడో అని అర్థం అవుతుంది. వారు ఆయనకు అపనమ్మకస్తులైయ్యారు, అందువల్ల ఆయన తీర్పు తీర్చలేకుండా ఉండలేకుండ పోతున్నాడు ఆ దేశం దేవుని యొక్క శ్రద్ధను నిర్లక్ష్యం చేసింది. అనే విషయం ఆ తోటను తోటమాలి ఎలా శ్రద్ధతో పెంపార చేశాడో అన్న విషయానికి నిదర్శనంగా ఉంది. దేవుడు ప్రేమించిన దేశం పై దేవుని తీర్పు త్వరగా దిగి వస్తుంది.

ఇది ప్రజలందరి వాస్తవం కాదా? దేవుడు తన రక్షణ మార్గాన్ని మనకి ప్రసాదించాడు. ఆయన తన ఆశీర్వాదాలను మనపైకి కుమ్మరించాడు. ఆయన ప్రేమను బట్టి మనం కూడ ఎంత విధేయతతో విశ్వాసముతో ఆయన ముందు నడువవలెనని మనలను కోరుకుంటున్నాడు. ఆయన శ్రద్ధను పొందిన ప్రజలు ఆయన చిత్తము యెడల విధేయత చూపించుట లేదు, ఆయనతో సహవాసానికి ఇష్టపడుటలేదు, ఆయన అందిస్తున్న ఆత్మీయ జీవితాన్ని ఆశతో ఆపేక్షించుట లేదు, అందుచేత వారికి మిగిలిందల్ల తీర్పు మాత్రమే.

## ❖❖❖ శ్రమలతో కూడిన తీర్పు ❖❖❖
## (5:8-23)

ఈ అధ్యాయం మొదటిలో (1-7 వచనాలు), దేవుడు ఈ యొక్క ద్రాక్షా పాట ద్వారా తన ప్రజలపైకి వస్తున్న తీర్పు గురించి ఉదహరించాడు ఈ ద్రాక్షతోటమాలి ప్రేమకు సరిగ్గా స్పంధించలేదు. అనగా ఇశ్రాయేలు ప్రజలు దేవునిపై తిరుగుబాటు చేసిన దానికి నిదర్శనంగా ఉంది, ఇప్పుడు ఈ ద్రాక్ష తోటను పెరికివేయవలసి ఉన్నది, ఇశ్రాయేలుకు కూడ అదే గతి పడుతుంది.

ఈ వాక్య భాగంలో దేవుడు శ్రమలను గురించి చెప్తూ జనుల పాపాలను గురించి విశ్లేషించాడు. ఈ శ్రమల గురించిన వివరణ మనకు దేవుడు దేనిని నిరాకరిస్తాడు? అందుకుగల నిశ్చితమైన కారణాలను గుర్తుకు తెస్తాము.

*దురాశ పరులకు శ్రమ.* అతడిలా అంటున్నాడు, "స్థలము మిగులకుండ మీరు మాత్రమే దేశములో నివసించునట్లు ఇంటికి ఇల్లు కలుపుకొని పొలమునకు పొలము చేర్చుకొను మీకు శ్రమ" (8 వచనం). అసలైన స్వంతదారులను నెట్టివేసి ఆ నివాసాలు కూడ తమకే కావాలంటూ ఆశబోతుతనంగా కలుపుకుంటున్నారు. కాని దేవుడంటున్నాడు వీరి గృహాలే నివాసయోగ్యం లేక నిర్మానుష్యమవుతాయి ఎందుచేతనంటే ఆయనకు ఈ దురాశ స్వభావమంటే యిష్టంలేదు.

*కోపిష్ఠులకు శ్రమ.* ఆయన ఇలా అంటున్నాడు "మద్యము త్రాగుదమని వేకువనే లేచి ద్రాక్షారసము తమకు మంట పుట్టించు వరకు చాల రాత్రివరకు పానముచేయువారికి శ్రమ" (11 వచనం). ఈ ప్రజలు సుఖ జీవితానికి అలవాటుపడి దేవుని చిత్తానికి తల వంచలేని రీతిగా ఉన్నారు. ఇశ్రాయేలు చరిత్రలో ఇలాంటి క్లిష్టపరిస్థితులలో ఈ స్వార్థపరులైన ప్రజలు విందులు వేడుకలు చేసికొనుచున్నారు. వారి యొక్క గ్రహింపులేని స్వభావాన్ని బట్టి వారు చెరలోనికి పోబడతారని దేవుడు ముందుగానే వాగ్దానము చేసినాడు కొందరు మరణానికి

గుర్రై పాతాళానికి కొనిపోబడతారు. అప్పుడు దేవుడు న్యాయ వంతుడని ఆయన తీర్పులు వాస్తవమని దేవుడు ఎంతో హెచ్చించబడతారు.

దేవుడు క్రమ శిక్షణ గల ప్రజల కొరకు ఎదురుచూస్తూన్నాడు ఆయన పనిని ఆయన విలువలను గమనించి విధేయతతో అనుసరించే ప్రజలు ఆయనకు కావాలి. ఆయన ఎలా చూస్తూన్నాడో వారు కూడ అదే విధముగా చూడాలని, ఆయనను ఏది ప్రోత్సహిస్తుందో అది వారిని కూడ ప్రోత్సహించాలని ఆయన కోరుకుంటున్నాడు.

*బానిసలైన వారికి శ్రమ.* ఆయన ఇలా అంటున్నాడు "భక్తిహీనతయను త్రాళ్లతో దోషమును లాగుకొను వారికి శ్రమ. బండిమోకులచేత పాపమును లాగుకొనువారికి శ్రమ" (18 వచనం). ఈ ప్రజలు అబద్దానికి బాగా అంటు కట్టబడి యున్నారు. అబద్ధానికి వీరు బాగా పూర్తిగా బంధించబడి వారు ఎక్కడికి వెళ్లినా అబద్ధాన్ని తీసుకొని పోతున్నారు.

వారికి సహాయము ఎంతో అవసరమైనప్పటికి వారు ఇలా అంటున్నారు, "ఆయనను త్వరపడనిమ్ము మేము ఆయన కార్యమును చూచునట్లు ఆయనను దానిని వెంటనే చేయనిమ్ము ఇశ్రాయేలుయొక్క పరిశుద్ధదేవుని ఆలోచన మాకు తెలియబడునట్లు అది మా యెదుట కనబడనిమ్ము" (19 వచనం). వారికి ఎన్ని అవకాశాలు దొరికినా దుష్టత్వానికి బానిసలైనారు. వారు సత్యాన్ని తృణీకరించారు, అది వారికి మేలైనది అని తెలిసినప్పటికి సత్యానిపై ఆధారపడలేదు.

*అవినీతిపరులైన వారికి శ్రమ.* అతనిలా అంటున్నాడు "కీడు మేలనియు మేలు కీడనియు చెప్పుకొని చీకటి వెలుగనియు వెలుగు చీకటనియు ఎంచుకొనువారికి శ్రమ. చేదు తీపి అనియు తీపి చేదనియు ఎంచుకొనువారికి శ్రమ" (20 వచనం). వారు దేవుని నియమాలను పూర్తిగా తలక్రిందులు చేశారు. ఎంతో గర్వ హృదయముతో ప్రవక్తమాటలను త్రోసిపుచ్చారు. తమకంతా వెలుగు అన్నట్లుగానో దేవుని సందేశాన్ని తక్కువ చేసి చూపించారు. దేవుడు ప్రకటించిన నీతి నియమ నిబంధనావళిని బహిరంగంగా మలినం చేశారు. దేవుని నీతి నియమాలను ఎవరైతే కించపరుస్తారో వారి మీద దేవుని ఉగ్రత దిగివస్తుంది.

*మోసగాళ్ళకు శ్రమ.* అతడిలా అంటున్నాడు "తమ దృష్టికి తాము జ్ఞానులనియు తమ యెన్నికలో తాము బుద్ధిమంతులనియు తలంచుకొనువారికి శ్రమ!" (21 వచనం). లోకంలోని జ్ఞానమంతా వాళ్ళదే అని విర్రవీగుతున్నారు. దేవుని దగ్గరనుండి వారికేమి వద్దని, దేవుని దగ్గరనుండిగాని దేవుని ప్రవక్తదగ్గరనుండి వారికేం అవసరం లేదని వారినమ్మకం. అంత శక్తి సామార్థ్యాలు వారికున్నాయంటూ దేవుణ్ణిమరిచారు. గర్వం అనేది వారి హృదయము నుండి ఉద్భవించే భయంకరమైన పాపం.

*ఎదురాడు వారికి శ్రమ.* అతడు ఇలా అంటున్నాడు "ద్రాక్షారసము త్రాగుటలో ప్రఖ్యాతినొందిన వారికిని మద్యము కలుపుటలో తెగువగలవారికిని శ్రమ. వారు లంచము పుచ్చుకొని దుష్టుడు నీతిమంతుడని తీర్పు తీర్చుదురు నీతిమంతుల నీతిని దుర్నీతిగా కనబడచేయుదురు" (22, 23 వచనాలు). ప్రజలు దుష్టత్వాన్ని గౌరవించి నీతిని చెరిపివేశారు. వాస్తవానికి వారు నీతి మీద యుద్ధాన్ని ప్రకటించారని చెప్పక తప్పదు.

ఇక్కడ ఎంత కఠినమైన భాష వాడుచున్నాము: శ్రమ, శ్రమ, శ్రమ, శ్రమ, శ్రమ! దేవుని యొక్క ధర్మశాస్త్రాన్ని విసర్జించి ఇశ్రాయేలు యొక్క పరిశుద్ధుని మాటను ధిక్కరించిన వారి మీద దేవుని తీర్పు ప్రకటించబడినది (24బి వచనం). దేవుని యొక్క ఉగ్రతా హస్తము వారి

మీదికి చూపించబడింది, వారికి శిక్ష విధించుట అనగా అంత శక్తి వంతమైన దేశము మీద శిక్షను కుమ్మరించుట దానికి తగినదే అని దేవుడు నిశ్చయించుకుంటున్నాడు. దేవుడు ఈల వేయగా అది సంభవిస్తుంది, అది దావానలంగా విస్తరిస్తుంది. దాని సైన్యము ఎంతో నైపుణ్యము గలదిగా చెండ ప్రచండగా యుద్ధము చేయగల సమర్థత కల్గిఉంది. ఎందుచేతనంటే దానికి రథములు సింహములు కల్గియున్నందున, ఆయన తీర్పు నిశ్చయంగా వారి మీద నెరవేరుతూ వారి మీద శ్రమ కొనసాగుతుంది.

నీతిమంతుడైన దేవుడు పాపాన్ని చూచి – చూడనట్లుగా ఉండడు – అన్న చిత్రం మరొక్కసారి గుర్తు చేయబడింది. ఈ శ్రమలన్నింటికి కారణం ఆయన దుష్టత్వాన్ని సహించడు అని అనడానికి గుర్తుగా ఉంది, ఆయన ప్రజలు ఆయన మాట వింటారా?

## వాక్యభాగాన్ని వివరించుట

**నీల్ ప్రయర్**

### ❖❖❖ మద్యపానం చేయుటలో "ఘనులు" ❖❖❖
### (5:11, 22)

ఒకసారొక మిషనరీ తాను ఆఫ్రికాదేశములో సేవ చేసినప్పటి అనుభవం నుండి ఒక గ్రామాన్ని ప్రస్తావించాడు. ఆ వూర్లో ప్రజలంతా దగ్గరలోవున్న సారాయి దుకాణాని కెళ్ళి రోజంతా మద్యం త్రాగుతూనే యుంటారట దానివల్ల వారేమి సుఖపడేవారు, రాత్రంతా బాధపడేవారు అలాగే శాశ్వతంగా కనుమూసేవారు. కొందరు ఉదయమే లేచి సారాయి సీసాలు పట్టుకొని వెళ్లేవారు. ఇక అలా నలభై సంవత్సరాలు కొనసాగేవారు సుమా! కొంత మంది మద్యలోనే చచ్చిపోయేవారు. ఇదే విధంగ ప్రవర్తించేవారి గురించే యెషయా మాట్లాడుచున్నాడు.